కమ్మేస్తున్న దుమ్ము, ధూళి!

- డ్రెయినేజీ, డివైడర్ల నిర్మాణాలతో ఇక్కట్లు
- అవస్థలు పడుతున్న ప్రజానీకం
- అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంపై ఆగ్రహం


అశ్వారావుపేట రహదారిపై దుమ్ము, ధూళి..

అశ్వారావుపేటరూరల్: అభివృద్ధి, సుందరీకరణ కోసం గడిచిన కొద్ది నెలలుగా సాగుతున్న పనులుపై ఓ శాఖ అధికారుల నిర్లక్ష్యం, ఆయా పనులు చేస్తున్న కాంట్రాక్టర్ల ఆలసత్వం కారణంగా ప్రజానీకానికి శాపంగా మారాయి. నెలల తరబడి సాగే ఈ పనులతో విపరీతమైన దుమ్ము, ధూళితో వాహనదారుల, స్థానికులు అనారోగ్యాల బారిన పడుతున్నారు. వివరాలిలా ఉన్నాయి.

అశ్వారావుపేట సెంట్రల్ లైటింగ్, డ్రెయినేజీ, రహదారి విస్తరణ పనుల కారణంగా గత కొద్ది నెలలుగా దుమ్ము, ధూళి సమస్య నెలకొంది. ఎన్నో ఏళ్లుగా కలగా మిగిలిన ఆయా అభివృద్ధి పనులు ఈ ఏడాది జూలై మొదటి వారం నుంచి పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు చేపట్టుతుండగా, ఈ పనులను స్థానిక రోడ్లు భవనాల శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. కాగా, గడిచిన ఐదు నెలలుగా జంగారెడ్డిగూడెం, సత్తుపల్లి, భద్రాచలం మార్గాల్లో ఆగుతూ, సాగుతున్న డివైడర్లు, డ్రెయినేజీ, రహదారి విస్తరణ పనులతో గడిచిన ఐదు నెలలుగా భారీగా దుమ్ము, ధూళి పేరుకుపోయింది. రహదారులపై పేరుకుపోయిన ఈ దుమ్ము, ధూళి వాహనాల రాకపోకల సమయంలో గాలికి లేచి కమ్మేస్తోంది. దీంతో పట్టపగలే రహదారి అంతా పొంగ మంచులా దట్టంగా మారుతుంది. వాహనాల రద్దీ సమయంలో దుమ్ము, ధూళితో వాహనాల వెనుక వచ్చే వారంతా నరకయాతన పడుతున్నారు. అలాగే రహదారి పక్కనే ఉన్న దుకాణాలదారులు దీని కారణంగా పడుతున్న అవస్థలు వర్ణాతీతంగా ఉంది. ఆయా పనులు ఏమోగాని, వాటి వల్ల దగ్గు, ఊపిరితిత్తుల సమస్యలు, శ్వాస కోశ వ్యాధుల బారిన అనారోగ్యగాల పాలౌతున్నామని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడిగా ఉన్న ఈ సమస్య ఉన్నప్పటికీ రోడ్లు భవనాల శాఖ అధికారులు గాని, ఆయా పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు కనీసం పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా దుమ్ము, ధూళిను సిబ్బందితో తొలగించి, ఉదయం, సాయంత్రం, మధ్యాహ్న వేళలో రహదారులపై ట్యాంకర్ల ద్వారా నీళ్లు చల్లించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఆర్ అండ్‌బీ ఏఈఈ శ్రీనివాస్ వివరణ కోరగా.. ఈ సమస్యపై గ్రామ పంచాయతీతో సమన్వయం చేసుకుని పరిష్కరిస్తామని అన్నారు.

అనారోగ్యానికి గురవుతున్నాం



మాది జంగారెడ్డిగూడెం మార్గంలో, రహదారి పక్కనే చిన్నపాటి పాన్‌షాపు ఉంది. గడిచిన కొద్ది నెలలుగా చేస్తున్న డివైడర్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులతో దుమ్ము లేస్తుంది. రోజంతా పడుతున్న దుమ్ము, ధూళితో దుకాణంలో ఉన్న సామగ్రి అంతా పాడౌతుంది. విపరీతమైన దుమ్ముతో దగ్గుతో బాధపడాల్సి వస్తోంది. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కాకి వెంకటేశ్వరరావు, పాన్‌షాపు యజమాని

పేరాయిగూడెంలో 'హలో శుభోదయం'


పేరాయిగూడెంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పేరాయిగూడెం గ్రామంలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హలో శుభోదయం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాలినడకన ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకుని త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. అదే విధంగా నియోకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నానని, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. అలాగే సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేరాయిగూడెం గ్రామంలో వంద శాతం సీసీ రోడ్ల నిర్మాణాలకు ఇప్పటికే ప్రతిపాదనలు చేశానని, త్వరలోనే నిధులు మంజూరు కానున్నట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తానని, సీసీ రోడ్ల నిర్మాణాలతో అంతర్గత రోడ్ల సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కారం అవుతాయన్నారు. సీసీ రోడ్లతోపాటు డ్రెయినేజీ, విద్యుత్ సమస్యల తోపాటు ఇతర అభివృద్ధి పనులు కూడా చేపట్టుతానని పేర్కొన్నారు. ముందుగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఏపీఓ రామచంద్రరావు, కార్యదర్శి శ్రీరామ్మూర్తి, పలు శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్, తుమ్మా రాంబాబు, జూపల్లి ప్రమోద్, ఎస్‌కే పాషా, మిండా హరి, నార్లపాటి రాములు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు.. రైతులకు వరాలు


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

చర్ల: ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులకు వరాలని, రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలోనే అమ్మి ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధరను పొందాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రమైన చర్లలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన స్థానిక సహకార సంఘం అధ్యక్షుడు పరుచూరి రవికుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.2,320లతో పాటు అదనంగా రూ.500ల బోనస్ ఇస్తోందని, అదే విధంగా సాధారణ రకం ధాన్యానికి క్వింటాకు రూ.2,300 ఇస్తోందని ఆయన తెలిపారు. రైతులు దళారీలకు దాన్యాన్ని అమ్మి నష్ట పోవద్దని, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఇందిరాక్రాంతిపథం, గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని అమ్ముకోవాలని ఆయన సూచించారు. చర్ల సహకార సంఘం సీఈఓ ఎస్‌డి.జిల్లానీ, సహకార సంఘ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు


ములకలపల్లి: మాట్లాడుతున్న గోపగాని శంకర్‌రావు

చండ్రుగొండ: కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, తమ ఉనికి కాపాడుకోవడానికి ఇలాంటి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్ రావు అన్నారు. సమితి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన మండలంలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా అమలు చేస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షపార్టీలు చేస్తున్న ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. కోడండరాం నాయకత్వంలో ఉద్యమకారులకు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరిట అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ పదేళ్లపాటు ప్రజలను గాలికి వదిలేసిందని ఆయన విమర్శించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్‌కె.నబీసాహెబ్, జిల్లా అధ్యక్షుడు దేవదానం, మండల కోఆర్డినేటర్ యూసుఫ్ పఠాన్ పాల్గొన్నారు.

ములకలపల్లి: తెలంగాణా జన సమితి (టీజేఎస్) సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉద్యమంలా సాగుతోందని సభ్యత్వ నమోదు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ గోపగాని శంకర్‌రావు తెలిపారు. ములకలపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అశ్వారావుపేట నియోజకవర్గ కో–ఆర్డినేటర్లు షేక్ నబీసాహెబ్, సిద్దెల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వాడవాడలా సభ్యత్వాలు నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నెలాఖరులోగా నమోదు ప్రక్రియ పూర్తిచేసి డిశంబర్ 5లోగా మండల నూతన అధ్యక్ష, కార్యవర్గాలను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. డిశంబర్ 9వ తేదీలోగా పాల్వంచలో జిల్లా పార్టీ ప్లీనరీని నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. వలస ఆదివాసీలకు ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వాలని, మూడు తరాలుగా జీవిస్తున్న గిరిజనేతరులకు పోడు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ఆకస్మిక మృత్యువాతపడ్డ ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య, సుబ్లేడు మాజీ సర్పంచ్ పాలెపొంగు సంజీవయ్య కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. జిల్లా, నియోజకవర్గ కో–ఆర్డినేటర్లు బరగడ దేవదానం, షేక్ నబీ సాహెబ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయ మోడల్ పరీక్షకు స్పందన


నవోదయ మోడల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

బూర్గంపాడు: సారపాకలోని బ్రిలియంట్ స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నవోదయ మోడల్ పరీక్షకు అనూహ్య స్పందన లభించింది. జిల్లాలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న 60 మంది విద్యార్థులు ఈ నవోదయ మోడల్ పరీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్రిలియంట్ విద్యాసంస్థల చైర్మన్ బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. నవోదయ పాఠశాలల్లో ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఈ మోడల్ పరీక్ష ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలోని చిన్నారుల ప్రతిభను ప్రోత్సహించి వారికి నవోదయలో ప్రవేశాలకు శిక్షణనిస్తున్నామన్నారు. ఈ నవోదయ మోడల్ పరీక్షలు రాసిన వారిలో ప్రథమ, ద్వితీయ స్థానాలను సాధించిన విద్యార్థులకు బ్రిలియంట్ స్కూల్‌లో ఉచితంగా నవోదయ పరీక్షలకు కోచింగ్‌నిస్తామన్నారు. ఈ నెల 28వ తేదీన మోడల్ పరీక్షల ఫలితాలను వెల్లడిస్తామన్నారు.

సీపీఎం మండల కార్యవర్గం ఎంపిక



దుమ్ముగూడెం: సమావేశంలో మాట్లాడుతున్న కారం పుల్లయ్య

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలం సీపీఎం నూతన మండల కమిటీని 9వ మండల మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా కారం పుల్లయ్యతో కలిపి 26 మందితో నూతన కమిటీ ఎన్నుకున్నారు. మహాసభలో 26 సమస్యలపై తీర్మానాలకు ఆమోదం తెలుపుకున్నారు. ప్రగళ్ళపల్లి లిఫ్ట్ ఇరిగేషన్‌కు నిధులు కేటాయించి సాగునీరు అందించడం, మండలంలో మిగిలిపోయిన పోడు అందరికీ హక్కు పత్రాలు ఇవ్వడం, త్రీఫేస్ కరెంటు సౌకర్యం కల్పించడం అందులోని ముఖ్యమైనవి. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు యలమంచి వంశీ, మర్మం చంద్రయ్య, కొర్సా చిలకమ్మా, బొల్లి సత్యనారాయణ, కొడాలి లోకేష్ బాబు, వాగే ఖాదర్ బాబు, యలమంచి శ్రీనుబాబు, కొమరం చంటి, పాల్గొన్నారు.

మణుగూరు మండల కార్యదర్శిగా సాంబశివరావు

మణుగూరుటౌన్: సీపీఎం మణుగూరు మండల కార్యదర్శిగా సత్రపల్లి సాంబశివరావును 19వ మండల మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఆదివారం దొడ్డినెప్రూ ఇంటి వద్ద కుంజా కృష్ణకుమారి ప్రాంగణంలో మహాసభ నిర్వహించగా, అతిథులుగా మాజీ ఎంపీ డాక్టర్ మీడియం బాబురావు, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు రమేశ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులుగా దామల్ల వెంకన్న, మడి నర్సింహారావు, బొల్లం రాజు పిట్టల నాగమణి, మండల కమిటీ సభ్యులుగా ఉప్పతల నర్సింహారావు, మాచారపు లక్ష్మణరావు, ఎస్ సుధాకర్, కుంజా రాజు, గుండు భీమయ్య, కొండ్రు గౌరి, తోట పద్మ, ములకల ఉత్తం, పల్లపు నాగేశ్వరరావు, పసునూరి సంజీవరెడ్డిలను ఏకగ్రీవంగా మహసభ ఎన్నుకుంది. కాగా, రాబోయే మూడు సంవత్సరాల కాలంలో మణుగూరు అభివృద్ధికి సభ తీర్మానాలు చేసింది. మున్సిపాలిటీ రద్దు చేసి పంచాయతీలుగా విభజించి ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టడం, మణుగూరు ఓసీ విస్తరణలో తిర్లాపురం, రామనుజవరం రైతులకు మెరుగైన ప్యాకేజీ చెల్లింపు, 2013 చట్టం ప్రకారం భూ సేకరణ జరిపి ప్యాకేజీ అందించడం వంటివి తీర్మాణాల్లోని అంశాలు.

పోరాటమే సీపీఎం లక్ష్యం


పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

కరకగూడెం: ప్రజల హక్కుల కోసం అవిశ్రాంత పోరాటమే సీపీఎం లక్ష్యమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ మూడో మహాసభలో పాల్గొని మాట్లాడుతూ..ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఖచ్చితంగా అమలు చేయాలని,కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు.అంతే కాకుండా డిసెంబర్ నెలతో కాంగ్రెస్ పాలన ఏడాది పూర్తవుతున్నసందర్భంగా వాగ్దానాల అమలుకు ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న,గద్దల శ్రీనివాసరావు, మండల కార్యదర్శి కొమరం కాంతారావు, నాయకులు చర్ప సత్యం, బిలపాటి శంకరయ్య, కనితి రాము, కోవాసి వెంకటేశ్వర్లు, అడమయ్య, పద్దం బాబురావు తదితరులు పాల్గొన్నారు.

వాగులోకి రోడ్డేశారు..


వాగులో ఆరంభమైన మట్టి రోడ్డు..

ములకలపల్లి: ఇసుకాసురులు యథేచ్ఛగా అక్రమ తోలకాలకు పాల్పడుతున్నారు. ముర్రేడు వాగులో కొంతమేర దారి వేసి మరీ తమ పని కానిచ్చేస్తున్నారు. ములకలపల్లి, పాల్వంచ మండలాల సరిహద్దులోని గుర్రాలకుంట బస్‌షెల్టర్ సమీపంలో వాగు దాటి షార్ట్‌కట్‌లో స్థానికులు ఇళ్లు చేరుతుంటారు. పాల్వంచ–మండలపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి వాగు వరకూ కాలిబాట ఉంది. ఈదారి గుండా కాలినడకన, బైక్‌లు, ట్రాక్టర్‌ల ద్వారా గుర్రాలకుంట వాసులు ఇళ్లకు వెళుతుంటారు. ఈ వాగు నుండి అర్ధరాత్రి వేళ ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే వాగులో ఆర్‌అండ్‌బీ రోడ్డు వైపు నీటి ప్రవాహం పెరగడంతో ఇసుక లోడుతో వెళుతున్న ట్రాక్టర్లు వాగులోనే దిగబడుతున్నట్లు సమాచారం. దీంతో సరికొత్తగా ఆలోచించి. కాలిబాట దారిపై మట్టిపోసి ట్రాక్టర్లకు అనువుగా మార్చుకున్నారు. మరొకడుగు ముందుకేసి వాగునీటిలోనూ కొంతమేర రోడ్డే వేసేసుకున్నారు. ఇందుకుగాను దారికి ఇరువైపులా ఉన్న చెట్లను కూడా తొలగించారు. ఈ దారి గుండా సులువుగా ట్రాక్టర్లు వాగు దాటి ఆవతలి ఒడ్డును ఇసుకను లోడు చేసుకోని, ఆర్‌అండ్‌బీ రోడ్డుకు చేరుకుని, పాల్వంచ తదితర పట్టణాలల్లో ఇసుక విక్రయాలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధితశాఖ అధికారులెవరూ స్పందించక పోవడం అనుమానాలకు తావిస్తోంది.

వన సమారాధనలతో ఐకమత్యం



దమ్మపేట: వనసమారాధనలో శ్రీకృష్ణుడికి పూజలు నిర్వహిస్తున్న యాదవ సంఘం మహిళలు


అశ్వారావుపేటరూరల్: వనసమారాధనలో బెలూన్ ఆట ఆడుతున్న ఆర్యవైశ్య మహిళలు


చండ్రుగొండ: ఆర్యవైశ్య సంఘం వనసమారాధనలో విందు ఆరగిస్తూ..

అశ్వారావుపేటరూరల్: కార్తీక మాసంలో ఏర్పాటు చేసుకునే వన సమారాధనలు ప్రజల్లో ఐక్యమత్యాన్ని పెంచేలా ఉండాలని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని గుర్రాలచెరువు గ్రామం, భద్రాచలం రోడ్‌లోని పామాయిల్ క్షేత్రాల్లో ఆర్యవైశ్య, మున్నూరు కాపు సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా కార్తీక వన సమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల బాధ్యులు ఎమ్మెల్యేను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. జ్ఞాపికలను అందించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించగా, చిన్నారులు, పెద్దలు, మహిళలు, యువతులంతా సందడి చేశారు. ఆట, పాటలతో ఆకట్టుకున్నారు. ఆట, పాటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్, తుమ్మా రాంబాబు, ఆయా సంఘాల బాధ్యులు సంకా ప్రసాద్, శీమకుర్తి శ్రీనివాస్, శీమకుర్తి సుబ్బారావు, బోగవల్లి రాంబాబు, యూఎస్ ప్రకాశ్‌రావు, చిన్నంశెట్టి సత్యనారాయణ, తాడేపల్లి రవి, నాగేశ్వరరావు, సత్యం రామకృష్ణ పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని ముత్యాలమ్మ దేవాలయం సమీపంలో లక్ష్మీనగరం గ్రామానికి చెందిన ఆర్యవైశ్యులు కార్తిక మాస వనభోజనాల కార్యక్రమాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు ఆడి పాడి సందడి చేశారు. కార్యక్రమంలో వాకచర్ల గౌరిశంకర్, వాకచర్ల శ్రీనివాసరావు, వాకచర్ల బుజ్జి,మాటూరి విజయ్‌కుమార్, కటుకూరి గురునాథ్, దోసపాటి వెంకటేశ్వరరావు, నంబూరి సురేష్, నంబూరి శ్యామ్, నరేష్, శ్రీకాంత్ తదితర ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

దమ్మపేట: మండల కేంద్రం, దమ్మపేట గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రాల్లో యాదవ, మున్నూరుకాపు సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా కార్తీక వనసమారాధన కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వనసమారాధనకు యాదవ, మున్నూరుకాపు సామాజిక వర్గాలకు చెందిన వారు వేర్వేరుగా వందల సంఖ్యలో కుటుంబ సమేతంగా హాజరై, ఒకరికొకరు యోగ క్షేమాలను తెలుసుకున్నారు. మహిళలు, యువతులు వ్యవసాయ క్షేత్రంలో ఉసిరి చెట్లకు పసుపు కుంకుమలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. యాదవ సంఘం మహిళలు కార్తీక దీపాలు వెలిగించి, శ్రీకృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పిల్లలు, యువత, పెద్దలు ఉదయం నుండి సాయంత్రం వరకు ఆటలు, పాటలు, వినోదం వంటి కార్యక్రమాలతో సంతోషంగా గడిపారు. ఔత్సాహికులు పాటలు, నృత్యాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రేక్షకులను అలరించారు. అందరూ ఒకే వేదికపై సహపంక్తిలో విందు భోజనాలను ఆరగించారు.

చండ్రుగొండ/అన్నపురెడ్డిపల్లి: ఆర్యవైశ్యసంఘం మండలశాఖ ఆధ్వర్యంలో వైశ్యులు ఆదివారం వన సమారాధన నిర్వహించారు. గ్రామశివారులోని మామిడితోటలో మహిళలు, పిల్లలు ఉత్సాహంగా వేడుకలో పాల్గొన్నారు. ఆటపాటలతోపాటు పిల్లలకు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు పసుమర్తి శేషగిరిరావు, దారా బాబు, సంకా కృపాకర్, ఎల్‌వీ రంగారావు, మిట్టపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఇక, అన్నపురెడ్డిపల్లిలోనూ ఆర్యవైశ్య మహాసభ మండలశాఖ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు ఆదివారం వనసమారాధన నిర్వహించారు. కార్తీకమాసోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీరామ సహిత సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు.

క్లుప్తంగా

పైప్‌లైన్‌కు మరమ్మతులు


వేములూరు గ్రామంలోని పైప్‌లైన్..

సాక్షి ఎఫెక్ట్..

అశ్వాపురం: మండల పరిధిలోని మారుమూల గిరిజన గ్రామమైన వేములూరు గ్రామంలో పైపులైన్‌కు మరమ్మతులు చేసి మిషన్‌భగీరథ నీరు సరఫరా చేశారు. ఈ నెల 22న 'అందని మిషన్ భగీరథ నీరు'అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మిషన్‌భగీరథ డీఈ మహేందర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్ ఆదేశాల మేరకు పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి మిషన్ భగీరథనీరు సరఫరా చేశారు.

చేయి చేయి కలిపి రహదారికి మరమ్మతులు


గ్రామస్తులు శ్రమదానం చేసి గుంతలు పూడ్చిన రహదారి

అశ్వాపురం: ఆ మారుమూల గ్రామానికి చెందిన గ్రామస్తులు ఎవరో వస్తారని ఎదురుచూడలేదు. సమస్య ఎవరి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వారే ఓ ఆలోచన చేశారు. ఇంటికి ఒకరు కలిసి చేయి చేయి కలిపి కోతకు గురైన రహదారిపై మట్టి పోసి గుంతలు పూడ్చారు. మండల పరిధిలోని మారుమూల గ్రామమైన మనుబోతులగూడెం రహదారి ఇటీవల వరదలకు కోతకు గురైంది. రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలమయమైంది. రహదారి సమస్యతో గ్రామంలో ఎవరికైనా అనారోగ్యానికి గురైతే ఆసుపత్రికి వెళ్లలేని పరిస్థితి వచ్చింది. ద్విచక్రవాహనం కూడా వెళ్ల లేని స్థితిలో ఉన్న రహదారిని మనుబోతులగూడెం గ్రామస్తులు ఇంటికి ఒకరు స్వచ్ఛందంగా వచ్చి రెండు రోజుల పాటు రహదారికి మరమ్మతులు చేసి ద్విచక్రవాహనం కూడా వెళ్లలేని రహదారిని వాహనాలు వెళ్లేలా గుంతలు పూడ్చివేశారు. ఆదివారం రహదారిపై ప్రయాణించిన ఎస్పీ రోహిత్‌రాజ్ శ్రమదానం చేసి రహదారికి మరమ్మతులు చేసిన గ్రామస్తులను అభినందించారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

దుమ్ముగూడెం: మండలంలోని రేగుపల్లి, నడికుడి నందుల చలక మొదలగు గ్రామాల్లో దీర్ఘ కాలికంగా నెలకొన్న వివిధ భూ సమస్యలను గ్రీవెన్స్ డేలో జిల్లా అధికారుల దృష్టికి తీసుకునివెళ్తామని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట నాయకులు తెలిపారు. ఆదివారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షుడు సోయం కామరాజు, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఈసాల సురేష్, రాష్ట్ర కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు ఆయా గ్రామాల్లో పర్యటించి అక్కడ ఉన్న సమస్యలను ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు సవలం హరి శంకర్, గొగ్గెల కోటి, కంగల ప్రవీణ్, కారం జోగారావు, కొర్స లక్ష్మి, మాయమ్మ, కుంజ వీరమ్మ,కణితి అర్జమ్మ, కొర్స బద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహాసభ ఏర్పాట్ల పరిశీలన

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుంటిమడుగు గిరిజన గ్రామంలో సోమవారం జరిగే సీపీఎం మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య కోరారు. ఈ మేరకు ఆదివారం మహాసభ ఏర్పాట్లను పార్టీ నాయకులతో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భవిష్యత్ ఉద్యమాలకు మహాసభ వేదిక అవుతుందని, నిర్వాసితులు, నిర్భాగ్యులకు అండగా సీపీఎం ఉంటుందన్నారు. పోడు పట్టాలు రాని గిరిజనులతో పోరాటాలు చేస్తామని తెలిపారు. మహాసభకు సీపీఎం జిల్లా, రాష్ట్ర కమిటీ బాధ్యులు హాజరు కానున్నరని పార్టీ శ్రేణులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని అన్నారు. నాయకులు సోడెం ప్రసాద్, చిరంజీవి, మడిపల్లి వెంకటేశ్వరరావు, వర్సా శ్రీవేణు పాల్గొన్నారు.

సామూహిక వ్రతం

మణుగూరురూరల్: పవిత్ర కార్తీకమాసం సందర్భంగా మండల పరిధిలోని వాసవీనగర్‌లో ఆదివారం సామూహికంగా శ్రీరమా సహిత వీరవెంకట సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. వ్రతానికి మణుగూరు సీఐ సోమ సతీష్‌కుమార్ హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని నియమనిష్టలతో వ్రతం చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులంతా తీర్థప్రసాదాలను స్వీకరించి తరించారు. కార్యక్రమంలో దోసపాటి నాగేశ్వరరావు, కత్తి రాము, వందనపు వాసు, చిట్టూరి శేషుబాబు, బండారు నరసింహారావు, కడివెండి విశ్వనాథ గుప్తా, వాసవినగర్ వాసులు తదితరులు పాల్గొన్నారు.